# సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం, 25, జనవరి, 2023




**వాసాలమర్రిలో గ్రామసభ**

వాసాలమర్రి అభివృద్ధిపై సాక్షిలో ప్రచురితమైన 'ఇళ్లు లేవు.. అనుమతులు లేవు' కథనానికి అధికారులు స్పందించారు. - 10లో



**పటిష్టమైన ప్రజాస్వామ్య దేశం**

భారత్ ప్రజాస్వామ్య దేశమని రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సచిన్‌నాయక్ అన్నారు. - 10లో

గరిష్ఠం/కనిష్ఠం 31.0°/17°

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై మధ్యాహ్నం ఆహ్లాదకరంగా, రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**మోత్కూరు :** రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్ 2, 3, 4 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినందున నిరుద్యోగుల కోసం 3 నెలల ప్రత్యేక ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 31 వరకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. భువనగిరిలో ఫిబ్రవరి 6 నుంచి మే 5 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసి ఎస్సీ అభ్యర్థులై ఉండాలని చెప్పారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించకూడదని, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

### మిరప పంట పరిశీలన



మిరప పంటను పరిశీలిస్తున్న క్లస్టర్ అధికారిణి నసీమా

సాక్షి ఎఫెక్ట్

**ఆత్మకూరు(ఎం) :** మండలంలోని టి.రేపాక, పోతిరెడ్డిపల్లి, ఉప్పలపహాడ్‌లో తెగుళ్ల బారిన పడి దెబ్బతిన్న మిరప పంటలను ఉద్యానశాఖ క్లస్టర్ అధికారి నసీమా మంగళవారం పరిశీలించారు. తెగుళ్లతో దెబ్బతిని నష్టపోతున్న మిర్చి రైతులపై సోమవారం 'సాక్షి'లో 'ముంచిన మిర్చి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో క్లస్టర్ అధికారి నసీమా మంగళవారం మిర్చి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పిచికారీ చేయాల్సిన మందులు వివరించారు. రైతులు చేపట్టాల్సిన యజమాన్య పద్ధతులు తెలిపారు. ఆమె వెంట రైతులు బండ యాదగిరి, శ్రీహరి తదితరులు ఉన్నారు.

### యాదాద్రిలో సంప్రదాయ పూజలు



ఆలయంలో నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

**యాదగిరిగుట్ట :** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజ నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని పూజలు చేశారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా నిర్వహించారు.

### భూసర్వేను అడ్డుకున్న రైతులు



సాయిరెడ్డిగూడెం వద్ద రెవెన్యూ అధికారులను అడ్డుకుంటున్న రైతులు

**వలిగొండ :** మండలంలోని అక్కంపెల్లి మధిర సాయిరెడ్డిగూడెం పరిధిలో రెవెన్యూ అధికారులు మంగళవారం ఆర్ఆర్ఆర్ కోసం భూసర్వేకు వెళ్లిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. రీజినల్ రింగ్ రోడ్డుతో రైతులకు ప్రభుత్వం నుంచి సరైన పరిహారం లభించడం లేదని వాపోయారు. మార్కెట్ విలువ ప్రకారం, లేదా భూమికి భూమి ఇవ్వాలన్నారు. తహసీల్దార్ గణేష్ నాయక్ మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న రైతుల సమస్యలు పరిష్కారించడానికి కలెక్టర్‌కు నివేదిక సమర్పించి, తగిన న్యాయం జరిగేటట్లు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ మనోహర్, సర్వేయర్ జ్యోతి, రైతులు గూడూరు సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, మోహన్ రెడ్డి, యాస మధు, బాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు కబ్జా !



భువనగిరి పెద్ద చెరువులో వెంచర్



భువనగిరి పెద్దచెరువులో మట్టి పోస్తున్న దృశ్యం

- యథేచ్ఛగా చెరువులను కబ్జా చేస్తున్న రియల్టర్లు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- జిల్లాలో మొత్తం చెరువులు 267
- ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినవి 233
- తేలని 34 చెరువుల లెక్క

| మండలం | చెరువులు | ఎఫ్‌టీఎల్ నిర్ధారించినవి | మిగిలినవి |
|---|---|---|---|
| బొచంపల్లి | 54 | 40 | 14 |
| బీబీనగర్ | 36 | 35 | 01 |
| భువనగిరి | 86 | 72 | 14 |
| బి.రామారం | 54 | 53 | 01 |
| చౌటుప్పల్ | 37 | 33 | 04 |

**సాక్షి, యాదాద్రి :** హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోగల జిల్లాలోని ఐదు మండలాల్లో చెరువులు కుంచించుకుపోతున్నాయి. కొన్ని చెరువులు కనుమరుగవుతున్నాయి. భూముల ధరలు కోట్ల రూపాయలకు పెరగడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతుండడంతో చెరువులపై అక్రమార్కుల కన్ను పడింది. దీంతో రియల్టర్లు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. అడ్డుకోవాల్సిన యంత్రాంగం పలు రకాల కారణాలతో చోద్యం చూస్తోంది. ఆరు సంవత్సరాల క్రితం హెచ్‌ఎండీఏ మండలాలైన భువనగిరి, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్, చౌటుప్పల్ మండలాల్లోని చెరువుల పరిరక్షణకు చర్యలు చేపట్టినప్పటికీ ఇంకా ఆ పని పూర్తి కాలేదు. జిల్లాలో 267 గుర్తింపు పొందిన చెరువులు ఉన్నాయి. వీటిలో భువనగిరి పెద్ద చెరువులో ఆక్రమణలు గుర్తించగా, మరో 34 చెరువుల ఆక్రమణలు జరిగినట్లు తెలుస్తోంది. ఫుల్ ట్యాంక్ లెవెల్ (ఎఫ్టీఎల్) లోపలికి వెళ్లి అక్రమ నిర్మాణాలు, వెంచర్ల ఏర్పాటు వంటి అక్రమాలు ఓ సర్వేలో వెలుగు చూశాయి.

**ఆరేళ్లుగా నత్తనడకన**

చెరువుల ఆక్రమణలను గుర్తించి ఎఫ్‌టీఎల్ నిర్ధయించేందుకు ఆరు సంవత్సరాల క్రితం ప్రభుత్వం చెరువుల రక్షణ కమిటీలను నియమించింది. ఆ బాధ్యతలను జిల్లా అదనపు కలెక్టర్‌కు అప్పగించింది. అయితే రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి శాటిలైట్ మ్యాప్‌లు, రెవెన్యూ రికార్డులతో పోల్చి చూసి ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలి. అయితే జిల్లాలోని ఐదు మండలాల్లో 267 చెరువులకు అధికారులు ప్రాథమిక నోటిఫికేషన్ సిద్ధం చేశారు. ఇంకా ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వలేదు. మరోవైపు వివిధ కారణాలతో 34 చెరువుల్లో ఉన్న ఆక్రమణలు గుర్తించారు. కోర్టు కేసులు, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఉన్నట్లు కూడా గుర్తించారు. అయితే వాటి ప్రాథమిక నోటిఫికేషన్ కూడా అధికారులు ఇవ్వలేకపోతున్నారు.

**సర్వే త్వరితగతిన పూర్తి చేస్తాం**



హెచ్‌ఎండీఏ మండలాల్లో చెరువుల సర్వే త్వరితగతిన పూర్తి చేస్తాం. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ పూర్తి చేసి ప్రాథమికంగా నోటిఫై చేసిన వాటికి ఫైనల్ నోటిఫికేషన్ సిద్ధం చేస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న చెరువులపై సమీక్షిస్తున్నాం. భువనగిరి పెద్ద చెరువు ఆక్రమణలను తొలగిస్తున్నాం. అన్ని చెరువులను పరిరక్షిస్తాం. భువనగిరి చెరువులో అక్రమ నిర్మాణాలను కూల్చివేశాం.

– దీపక్ తివారీ, అదనపు కలెక్టర్

**ఆక్రమణలో భువనగిరి పెద్దచెరువు**

భువనగిరి పెద్దచెరువు ఆక్రమణలకు గురవుతోంది. 250 ఎకరాల ఎఫ్‌టీఎల్ నిర్ధారించిన చెరువులో ప్రతి సంవత్సరం నిర్వహించే బతుకమ్మ పండుగ ఏర్పాట్లు చేసే క్రమంలో చెరువు శిఖంలో మట్టిపోస్తున్నారు. అలాగే రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకు వచ్చి నిర్మాణాలు చేపట్టారు. జగ్‌దేవ్‌పూర్ రోడ్డు వైపు చెరువులో మట్టి పోశారు. బతుకమ్మ కోసం జిన్నింగ్ మిల్ గేట్ గుండా వాహనాల్లో మట్టిని పోయడం ప్రతి యేడు జరుగుతోంది. నవంబర్‌లో సెలవు రోజుల్లో మిల్ యాజమాన్యం చెరువులోకి మట్టిని తరలించి పూడ్చివేశారు. అధికారులు పరిశీలనకు వచ్చి పనులను నిలిపివేయడం తప్ప ఆక్రమణలను మాత్రం పూర్తి స్థాయిలో తొలగించలేకపోతున్నారు.

# సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు

- పీహెచ్‌సీల పరిధిలోని ఒక్కో సబ్‌సెంటర్ నిర్మాణానికి రూ.20 లక్షలు
- 24 సబ్‌సెంటర్లకు రూ. 4.80 కోట్లు మంజూరు
- తొలివిడతలో రూ.2.40 కోట్లు విడుదల

**సాక్షి, యాదాద్రి :** జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో ఉన్న 24 సబ్ సెంటర్ల పక్కాభవనాలకు ప్రభుత్వం రూ.4.80 కోట్లు మంజూరు చేసింది. ఒక్కో సెంటర్‌కు రూ. 20 లక్షల చొప్పున నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిధుల్లో ఒక్కో సబ్‌సెంటర్‌కు రూ.10 లక్షల చొప్పున తొలివిడతలో రూ.2.40 కోట్లు విడుదల చేశారు. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లోని పీహెచ్‌సీల పరిధిలోని సబ్‌సెంటర్లకు మంజూరైన నిధుల్లో తొలివిడతలో సగం నిధులను విడుదల చేశారు. ఈమేరకు భవన నిర్మాణాలు చేపట్టాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. భువనగిరి నియోజకవర్గంలోని జిబ్లక్‌పల్లి, వంకమామిడి, చిన్నరావులపల్లి, మూడంపల్లి, గూడూరు, జమీలాపేట, వెల్వర్తి, అనాజిపూర్, బస్వాపూర్, చందుపట్ల, రాయిగిరి, ఆలేరు నియోజకవర్గంలోని నాంచారిపేట, పారుపల్లి, బొందుగుల, కొమ్మాయిపల్లి, మాసాన్‌పల్లి, వేలుపల్లి, వీరారెడ్డిపల్లి, కూరెల్ల, రామలింగంపల్లి, మైలారం, చొల్లేరు, మాసాయిపేట, గుండ్లగూడెం సబ్ సెంటర్లకు నిధులు మంజూరు అయ్యాయి.

# సవాల్‌గా మారిన బాలికల సంరక్షణ

- మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతీదేవి

**యాదగిరిగుట్ట :** నేటి సమాజంలో బాలిక సంరక్షణ పెను సవాలుగా మారిందని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి అన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బాలిక సంరక్షణ, విద్యా అభివృద్ధిలో బాధ్యతగా మెలగాలని, వారికి గల చట్టపరమైన హక్కుల సాధికారతకు సంబంధిత సంస్థలు, సంఘ సేవ కర్తలు, పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ లాయర్లు కృషి చేయాలన్నారు. బాలికలపై అకృత్యాలకు పాల్పడితే చట్టం ఊరుకోదని పేర్కొన్నారు. ఈ ర్యాలీ యాదగిరిగుట్ట ఆర్టీసీ బస్టాండ్ నుంచి వైకుంఠద్వారం వరకు సాగింది. ర్యాలీలో న్యాయసేవా సంస్థ కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె.దశరథరామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, బాలల సంరక్షణ సమితి అధ్యక్షురాలు బి.జయశ్రీ, భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేశవరెడ్డి, ఆలేరు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ శివశంకర్‌గౌడ్, పట్టణ సీఐ సైదయ్య, డీసీపీఓ సైదులు, డీఆర్‌డీ ఏపీఓ రమణ, మల్లేష్, వెంకటేశ్వర్లు, శ్రీశైలం, శివలింగం, సత్యనారాయణ తదితరులున్నారు.



మానవహారం నిర్వహిస్తున్న జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి మారుతీదేవి, ప్రధాన సివిల్ జడ్జి దశరథ రామయ్య, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు తదితరులు

# ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేయొద్దు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

**భువనగిరి :** జిల్లా కేంద్ర ఆస్పత్రికి వచ్చే రోగులను ఇతర ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి సలహా సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి ఆస్పత్రిలోని డయాగ్నోస్టిక్ హబ్ నిర్మాణ పనులు, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు పనులు పరిశీలించారు. ఆస్పత్రిలోని ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు వివరాలపై సంబంధిత సిబ్బందితో మాట్లాడారు. రోగులకు, ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు అవసరం మేరకు బ్లడ్ ఇచ్చే విధంగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఏరియా ఆస్పత్రి నుంచి జిల్లా కేంద్ర ఆస్పత్రి స్థాయికి పెరిగింది, కానీ అందుకు అనుగుణంగా పోస్టులు పెరగలేదని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ డయాగ్నోస్టిక్ సెంటర్ మార్చిలో పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. అప్పటికి ప్రభుత్వం కొత్తగా వైద్య పోస్టులు మంజూరు చేస్తుందని, జిల్లా ఆస్పత్రికి కూడా కొత్తగా పోస్టులు మంజూరు చేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి విజ్ఞప్తి చేస్తామని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ చిన్ననాయక్, వైద్యులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ సునీత, జెడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి

# కొనసాగుతున్న భూనిర్వాసితుల దీక్ష

**భువనగిరి :** బస్వాపూర్ రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న భూములకు పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీఎన్ తిమ్మాపురం గ్రామ భూ నిర్వాసితులు ప్రాజెక్టు కట్టపై చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 57వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపు కింద భూములు కోల్పోయిన వారందరికీ ఒకేసారి పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిన్న నర్సింహ, పిన్నం దశరథ, జిన్న పాండు, హరినాథ్, రాములు, ఐలయ్య, వెంకటేష్, లక్ష్మీనర్సయ్య, ఆంజనేయులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**నోటీసులను తిరస్కరించిన గ్రామస్తులు**

ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామంలోని ఇళ్ల యజమానులకు మంగళవారం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చేందుకు గ్రామంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులకు తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించి, పునరావాసం కింద వెంటనే ప్లాట్లు కేటాయించాలన్నారు. అదేవిధంగా ఇళ్ల నిర్మాణానికి కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని తెలిపారు. పూర్తిగా పరిహారం చెల్లించాకే నోటీసులు స్వీకరిస్తామని, అప్పటి వరకు నోటీసులు స్వీకరించబోమని పేర్కొన్నారు. దీంతో అధికారులు చేసేదేమీలేక వెనుతిరిగారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి భద్రయ్య, నవనీత, ఉడుత మహేందర్, నరసింహ, సత్తయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



దీక్ష చేస్తున్న బీఎన్ తిమ్మాపురం భూ నిర్వాసితులు

- మార్కండేయ శోభాయాత్ర



భక్త మార్కండేయ జయంతి సందర్భంగా భువనగిరిలో మంగళవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

# బదిలీలు, పదోన్నతులకు సన్నాహాలు

- అర్హుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైన విద్యాశాఖ
- జిల్లాలో 619 ఖాళీలు
- ఈ నెల 27 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ



**భువనగిరి :** ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీల నిరీక్షణకు తెరపడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నెల 27 నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుండగా బదిలీలు, పదోన్నతుల విధివిధానాలను ప్రకటించాల్సి ఉంది. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అర్హుల జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే బదిలీలకు సంబంధించి ఖాళీల వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. మరోవైపు పదోన్నతులకు కూడా సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నారు. దీర్ఘకాలంగా ఒకే స్థానంలో ఉన్న ప్రధానోపాధ్యాయులతో పాటు పదోన్నతులకు అర్హుల వివరాలను సేకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే పారదర్శకతతో ఈ ప్రక్రియను పూర్తి చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

**అర్హుల జాబితా కసరత్తు..**

ఉపాధ్యాయుల బదిలీలను 2018లో చేపట్టారు. ప్రస్తుతం విభాగాల వారీగా జాబితాలను విద్యాశాఖ తాత్కాలికంగా సిద్ధం చేసింది. ఒకే పాఠశాలలో 8 ఏళ్లుగా పనిచేస్తున్న వారితో పాటు పదవీ విరమణకు మూడేళ్లలోపు సీనియారిటీ ఉన్న వారి వివరాలను సేకరించింది. మొత్తంగా మంజూరైన పోస్టులు, ప్రస్తుతం పని చేస్తున్న వారు, లాంగ్ స్టాండింగ్‌లో ఉన్న వారు, ఖాళీల వివరాలను విద్యాశాఖ బదిలీల కోసం వెబ్‌సైట్‌లో పరిశీలన కోసం పొందుపర్చింది. అదేవిధంగా 2015లో పదోన్నతులు చేపట్టారు. ఏడేళ్ల తర్వాత ఈ ప్రక్రియ నిర్వహిస్తుండడంతో విభాగాల వారీగా సీనియారిటీ జాబితా రూపొందించే పనిలో విద్యాశాఖ నిమగ్నమైంది. ఇందులో రూపొందించిన గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల గ్రేడ్- 2 జాబితాను ఆర్జేడీకి పంపించనున్నారు. జాబితా పూర్తికాగానే వాటిపై అభ్యంతరాలను స్వీకరించి మార్పులు చేర్పులు చేపట్టనున్నారు. మల్టీజోనల్ పద్ధతిలో జరిగే పీజీహెచ్‌ఎం-గ్రేడ్ 2 బదిలీల అనంతరం ఏర్పడిన ఖాళీల ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు ఇవ్వనున్నారు. అనంతరం ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తారు. దీంతో ఎస్జీటీల ఖాళీలు ఏర్పడనున్నాయి. బదిలీల్లో పండిట్లు, పీఈటీలకు అవకాశమున్నా పదోన్నతుల విషయంలో పండిట్, పీఈటీ పోస్టుల అప్‌గ్రెడేషన్ సమస్య వారిలో సందిగ్ధంగా మారింది.

**2746 మంది పనిచేస్తున్నారు**

జిల్లాలో 3465 పోస్టులు మంజూరు కాగా 2746 మంది పనిచేస్తున్నారు. 619 ఖాళీలు ఉన్నాయి. ఇందులో గ్రేడ్- 2 జీహెచ్‌ఎం పోస్టులు 163 మంజూరు కాగా 73 మంది పనిచేస్తున్నారు. 90 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలు ఈసారి భర్తీ కానున్నాయి. వీటితో పాటు ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు 765 మంది ఉండగా మూడేళ్లలోపు పదవీ విరమణ పొందే వారు 76 మంది ఉన్నారు.

**సీనియారిటీ జాబితాను సిద్ధం చేస్తున్నాం**



ప్రభుత్వం ఉపాధ్యాయులకు సంబంధించి పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కోసం షెడ్యూల్ విడుదల చేసింది. అనంతరం చేయనున్న మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని నిర్వహించబడుతుంది. ప్రస్తుతం బదిలీల ఖాళీలకు సంబంధించి జాబితా పూర్తికాగా సీనియారిటీ జాబితాను తయారు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే పరిశీలన కోసం వెబ్‌సైట్‌లో పొందుపరుస్తాం.

– నారాయణరెడ్డి, డీఈఓ

**స్కూల్ అసిస్టెంట్ల ఖాళీల వివరాలు**

| సబ్జెక్టు | మంజూరైనవి | ప్రస్తుతం పనిచేస్తున్నవారు | ఖాళీలు |
|---|---|---|---|
| గణితం | 304 | 278 | 26 |
| భౌతిక శాస్త్రం | 222 | 219 | 03 |
| బయోసైన్స్ | 226 | 177 | 49 |
| సాంఘిక శాస్త్రం | 259 | 180 | 79 |
| ఇంగ్లిష్ | 232 | 189 | 43 |
| తెలుగు | 104 | 65 | 39 |
| హిందీ | 102 | 78 | 24 |
| ఉర్దూ | 02 | 02 | - |
| ఫిజికల్ డైరెక్టర్ | 18 | 14 | 04 |
| ఎస్జీటీలు | 1381 | 1252 | 129 |
| తెలుగు (ఎల్‌పీ) | 129 | 115 | 14 |
| హిందీ | 77 | 72 | 05 |
| ఉర్దూ | 04 | 03 | 01 |
| పీఈటీలు | 84 | 82 | 02 |
| డ్రాయింగ్ | 14 | 01 | 13 |
| క్రాఫ్ట్ | 26 | 02 | 24 |
| ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్ | 10 | 06 | 04 |
| మ్యూజిక్ టీచర్ | 03 | 01 | 02 |

### కంటి పరీక్షలు చేయించుకోవాలి

- డీఎంహెచ్‌ఓ మల్లికార్జునరావు

**భూదాన్‌పోచంపల్లి :** అర్హులైన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 2వార్డులో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. కంటి పరీక్షలు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి పాపారావు, పీఓడీటీ ప్రశాంత్, కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ సుమన్‌కల్యాణ్, వైద్యాధికారిణి శ్రీవాణి, సిబ్బంది పాల్గొన్నారు.

# హైవేపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి




రైల్వేస్టేషన్ సమీపంలో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

- వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అతహర్

**బీబీనగర్ :** మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రైల్వేస్టేషన్ సమీపంలో వైఎస్సార్‌టీపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అతహర్ మాట్లాడుతూ జాతీయ రహదారి వద్దకు చేరుకోవడానికి పట్టణంలో నుంచి వివిధ గ్రామాల విద్యార్థులు, ప్రజలు నడిచి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జాతీయ రహదారిపై ఫుట్‌ఓవర్ బ్రిడ్జి లేకపోవడంతో రహదారి దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మట్ట శ్రవణ్, వెంకటేష్, రమేష్, లింగాచారి, బాలశంకర్, సాయినివాస్, రాకేష్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మృతుడు హాలియా వాసిగా గుర్తింపు


ఏడుకొండలు (ఫైల్)

**నార్కట్‌పల్లి:** మండలంలోని చెర్వుగట్టు గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో ఈ నెల 22న సగం కాలిన వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయంతెలిసిందే. మృతదేహానికి సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా మృతుడి ఎడమ చేతిపై కావ్య అని, కుడి చేతిపై వృత్తాకారంలో అమ్మ అని, కుడి భుజంపై సూర్యుని ఆకారంలో ఓం అని పచ్చబొట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని పలు పత్రికలలో ప్రచురించగా.. హాలియాలోని రెడ్డి కాలనీకి చెందిన కంభంపాటి నరేందర్ చూసి చనిపోయింది తన తమ్ముడు కంభంపాటి ఏడుకొండలు(28) అని గుర్తించి మంగళవారం నార్కట్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. తన తమ్ముడు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అతడి మృతిపై విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

### చేపల వేటకు వెళ్లి గుండెపోటుతో వ్యక్తి మృతి

**మిర్యాలగూడ టౌన్:** చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మంగళవారం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప వద్ద చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ ఉమాపతిరావు తెలిపిన వివరాల ప్రకారం... ఆలగడప గ్రామానికి చెందిన నల్లగొండ గంగయ్య(58) తన కుమారుడు వెంకన్నతో కలిసి చేపలు పట్టేందుకు మంగళవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలో గల మూసీ నది వద్దకు వెళ్లగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడి కుమారుడు బైక్‌పై గంగయ్యను గ్రామానికి తీసుకొచ్చి ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చూపించగా అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

**చిట్యాల:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలంలోని గోపాలయపల్లి గ్రామానికి చెందిన మునుకుంట్ల సురేష్(26) ఈ నెల 9వ తేదీన చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

### రేషన్ బియ్యం పట్టివేత

**కోదాడరూరల్:** కోళ్ల ఫారంలో నిల్వ చేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు మంగళవారం పట్టుకున్నారు. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామ శివారులో గల వరలక్ష్మి కోళ్లఫారంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వచేశారనే సమాచారం మేరకు సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ రాంరెడ్డి తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా 10 క్వింటాళ్ల బియ్యం పట్టుబడినట్లు ఆయన తెలిపారు. బియ్యాన్ని నిల్వ చేసిన యడవల్లి మధు, నలబాపన పరమేశ్వరరావుపై కేసు నమోదు చేసి బియ్యం, 2 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

# వ్యక్తిపై హత్యాయత్నం

- పోలేనిగూడెం వాసిని కత్తులతో వెంబడించి దాడి చేసిన దుండగులు
- వారి నుంచి తప్పించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చిన బాధితుడు
- పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోగా పరారైన నిందితులు
- కోదాడ శివారులోని వెంచర్‌లో ఘటన

**చిలుకూరు:** మండలంలోని పోలేనిగూడెం వాసి అయిన అధికార పార్టీ చెందిన పనస గోపిపై సోమవారం రాత్రి కోదాడ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో హత్యాయత్నం చేశారు. బాధితుడు, అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పనస గోపి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా ఉంటూ, ఇటీవల వ్యక్తిగత కారణాలతో అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో చేరాడు. అయితే గోపి సోమవారం రాత్రి 8గంటల సమయంలో బరాఖత్‌గూడెం నుంచి కొమరబండ మీదుగా కోదాడ హైవే పక్కన గల వెంచర్ గుండా బైక్‌పై కోదాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గోపి వెంచర్‌లోకి రాగానే గుర్తుతెలియని వ్యక్తులు అతడిని ఆపి కర్రలతో కొట్టడంతో పాటు కత్తితో పొడిచారు. గోపి వారి నుంచి తప్పించుకుని తన స్నేహితులు, కోదాడ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుల కోసం చుట్టుపక్కల వెతికగా, అప్పటికే వారు పరారయ్యారు. తీవ్రగాయాల పాలైన గోపిని పోలీసులు వెంటనే కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని, వారు ముఖానికి ముసుగులు వేసుకున్నారని గోపి పోలీసులకు తెలిపాడు. అందులో ఒకరు ముసుగు తీయడంతో ఆ వ్యక్తిని తాను చూశానని, వారు ఈ ప్రాంత వ్యక్తులుగా లేరని, 'మీ గ్రామానికి చెందిన కొందరు నిన్ను చంపమని రూ.6లక్షలు ఇచ్చారురా' అని నిందితులు చెప్పినట్లుగా గోపి పోలీసులకు వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కోదాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

**బయటపడ్డ విభేదాలు**

గోపిపై కత్తులతో హత్యాయత్నం జరగడంతో పోలేనిగూడెం గ్రామంలో మరోమారు వర్గ విభేదాలు బయటపడ్డాయి. గ్రామంలో మొదటి నుంచి రెండు వర్గాలు ఉండగా, ఇటీవల వారందరూ ఒకే పార్టీలో చేరారు. అయినప్పటికీ గ్రామంలో చిన్న చిన్న ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో 2014 ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్య జరగగా, ఏడాది క్రితం గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇప్పుడు గ్రామానికి చెందిన వ్యక్తిపై హత్యాయత్నం జరగడంతో గ్రామంలో భయాందోళనకు గురవుతున్నారు.

## భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త రిమాండ్

**తిరుమలగిరి(నాగార్జునసాగర్):** వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందనే భార్యను హింసించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తను పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలంలోని జాల్‌తండాకు చెందిన జటావత్ మాలిక్, సాలి(36) భార్యాభర్తలు. మాలిక్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో మాలిక్, సాలి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని మాలిక్ మానసికంగా, శారీరకంగా సాలిని వేధించడం మొదలు పెట్టాడు. దీంతో సాలి ఈ నెల 19న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం మాలిక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

**మూడేళ్ల జైలుశిక్ష..**

**బీబీనగర్:** అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు న్యాయమూర్తి దశరథ రామయ్య మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకిర్యాలకు చెందిన ఆగమయ్య తన కుమార్తె లావణ్యను జమీలాపేట గ్రామానికి చెందిన కృష్ణకు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం చేశాడు. అదనపు కట్నం కోసం లావణ్యను కృష్ణ వేధింపులకు గురిచేస్తుండేవాడు. దీంతో విసుగు చెందిన లావణ్య 2014 డిసెంబర్ 8న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ ప్రణీత్‌కుమార్ కృష్ణను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కాగా కృష్ణపై మరో చార్జిషీట్ దాఖలు కాగా, మంగళవారం భువనగిరి కోర్టులో దీనిపై జరిగిన విచారణలో న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడు కృష్ణకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

## మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం

- అజ్మాపురంలో ఘటన

**పెద్దఅడిశర్లపల్లి:** మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన మంగళవారం మండలంలోని అజ్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అజ్మాపురం గ్రామానికి చెందిన ఆడెపు అంజయ్య, గోసంగి ప్రసన్న, వస్కుల రాజేష్ అదే గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలిని బలవంతంగా గ్రామ శివారులో గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బలాత్కారం చేసేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో బాధితురాలి సోదరుడు ఆమెను వెతుక్కుటూ వెళ్లగా ఆ ముగ్గురూ పారిపోయారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కొండమల్లేపల్లి సీఐ రవీందర్ గుడిపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఈ ఘటనపై విచారణ చేపడుతున్నారు.

## అదుపుతప్పి ఆటో బోల్తా

- ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలు

**నేలకొండపల్లి:** కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడేనికి చెందిన వ్యవసాయ కూలీలు మంగళవారం నాట్లు వేసేందుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని అనాసాగారం వచ్చారు. నాట్లు వేశాక తిరిగి వెళ్తుండగా వీరి ఆటో కొత్తకొత్తూరు సమీపాన అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్. నాగమణి, టి. మణెమ్మకు తీవ్రగాయాలు, మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## డీజిల్ దొంగతానికి పాల్పడుతున్న ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

**సూర్యాపేట క్రైం:** జాతీయ రహదారుల వెంట ఆగి ఉన్న లారీలను లక్ష్యంగా చేసుకొని డీజిల్ దొంగతనం చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం ఎక్స్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీల్లో భాగంగా ఒక లారీని ఆపి చెక్ చేస్తుండగా డ్రైవర్ లెక్కల పూర్ణయ్య పారిపోయేందుకు ప్రయత్నించగా అతడితో పాటు లారీలో ఉన్న బాణావత్ కృష్ణ నాయక్, కునిశెట్టి ముసలయ్యను పట్టుకుని విచారించారు. వీరు గత ఐదు రోజులుగా సూర్యాపేట జాతీయ రహదారి వెంట ఆగి ఉన్న లారీలను లక్ష్యంగా చేసుకొని ఎలక్ట్రానిక్ మోటారు సహాయంతో డీజిల్ దొంగలించి, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వ్యవసాయదారులకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి లారీతో పాటు 1500 లీటర్ల డీజిల్, వన్‌హెచ్‌పీ మోటరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరు 2016 నుంచి ఇదే విధంగా నేరాలు చేస్తూ జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

**ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడు..**

క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన బొంత ఉదయ్ మంగళవారం ఉదయం పట్టణంలోని చంద్రన్న కుంటలోని ఓ ఇంట్లో దొంగతనం చేస్తుండగా ఇంటి యాజమాని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం ఉదయ్‌ను పోలీసులు అతడి ఇంటి వద్ద పట్టుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. సూర్యాపేట వన్‌టౌన్ పరిధిలో 3, సూర్యాపేట టూటౌన్ పరిధిలో ఒక దొంగతనం చేశాడని, క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టి నష్టాలు రావటంతో నిందితుడు దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ.3.35 లక్షల నగదు, 5తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుఉని, న్యాయంస్థానంలో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ కేసులను ఛేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు ఎస్‌కే. యాకూబ్, క్రాంతి, హెడ్ కానిస్టేబుళ్లు కృష్ణ, కరుణాకర్, కానిస్టేబుళ్లు సైదులు, ఆనంద్, మధులను ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగభూషణం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఫ్యాక్టరీలో గాయపడి.. చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**భువనగిరి:** భువనగిరి పట్టణ శివారులోని ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీలో మంగళవారం విధి నిర్వహణలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ప్రమోద్ బింద్(32) ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీలో 6 నెలలుగా హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా మంగళవారం తెల్లవారుజామున విధులు నిర్వహిస్తున్న క్రమంలో స్టాకింగ్ మిషన్‌పై నుంచి పడిపోయాడు. తోటి కార్మికులు గమనించి చికిత్స నిమిత్తం అతడిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని సనత్‌నగర్‌లో గల ఈఎస్‌ఐ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు.

# ఆరుగురు దొంగల అరెస్ట్

- రూ.32.83లక్షల సొత్తు రికవరీ


రికవరీ చేసిన సొత్తును పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

**మోత్కూరు:** ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32.83లక్షలు విలువైన సొత్తును రికవరీ చేసుకున్నారు. మంగళవారం రామన్నపేట సీఐ మోతీరామ్, మోత్కూరు ఎస్‌ఐ వి. జానకిరాంరెడ్డి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండకు చెందిన బొడిగె అశోక్‌తో పాటు చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన గుండెబోయిన చంద్రం, నూకి సతీష్, బైరవోని స్వామి, బేడె బాలకృష్ణ, నార్కట్‌పల్లి మండలం సప్పిడిగూడెం గ్రామానికి చెందిన గంధసిరి ఉపేందర్ తాళం వేసిన ఇళ్లు, గ్రామ శివారుల్లో ఉండే ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పర్యవేక్షణలో భువనగిరి డీసీపీ కె. నారాయణరెడ్డి, భువనగిరి క్రైం డీసీపీ బి. శ్రీబాల, అడిషనల్ డీసీపీ లక్ష్మి ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఏసీపీ ఎస్. ఉదయ్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. సైదయ్య, దేవేందర్ బృందం కొంతకాలంగా బొడిగె అశోక్ ఇంటి వద్ద నిఘా పెట్టి ఈ నెల 23న అతడిని పట్టుకుని విచారించగా చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అశోక్ ఇచ్చిన సమాచారం మేరకు మిగతా ఐదుగురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.32.83లక్షల విలువైన 50 తులాల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి ఆభరణాలు, 2 బైక్‌లు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో 9, అడ్డగూడూరులో 2, ఆత్మకూరు(ఎం)లో 7, వలిగొండలో 2, రామన్నపేటలో 4, యాదగిరిగుట్టలో 3, రాజపేటలో 3, నకిరేకల్‌లో 3, తొర్రూరులో 1, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 34 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు నేరస్తులను అరెస్టు చేసి నల్లగొండ జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

## కలల కొలువు రాకుండానే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం, మరో నలుగురికి గాయాలు
- మృతుడు వలిగొండ మండలం పొద్దుటూరు వాసి


వినోద్‌కుమార్ మృతదేహం

**ఆమనగల్లు:** పోలీసు కొలువు కోసం ఆ యువకుడు కన్న కలలు కల్లలయ్యాయి. ఆర్టీసీ బస్సు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ కల తీరకుండానే బలితీసుకుంది. మరో నలుగురు యువకులను ఆస్పత్రి పాల్జేసింది. ఈ విషాదకర సంఘటన మంగళవారం రాత్రి రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణ సమీపంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వివిధ ప్రాంతాలకు చెందిన వినోద్‌కుమార్ (25), భరత్‌కుమార్, పవన్‌కల్యాణ్, వీరేశ్, సుధాకర్ హైదరాబాద్ నల్లకుంటలో ఉంటూ పోలీసు శిక్షణ పొందారు. ప్రిలిమినరీ, ఫిజికల్ ఈవెంట్స్‌లో పాల్గొని మెయిన్ పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారు. కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ఆమనగల్లులోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదాద్రి జిల్లా వలిగొండ మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భరత్‌కుమార్, పవన్‌కళ్యాణ్, వీరేశ్, సుధాకర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వినోద్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుందరయ్య తెలిపారు.

## పత్తి దొంగిలించారని ఫిర్యాదు

**రామగిరి(నల్లగొండ):** తిప్పర్తి మండలంలోని యాపలగూడెం గ్రామానికి చెందిన ముకిరాల శివలింగం, మామిడాల గ్రామానికి చెందిన కొత్తపల్లి రమణయ్య, ఇండ్లూరు గ్రామానికి చెందిన మామిడి జానయ్య, సత్తయ్య తమకు సంబంధించిన 5 క్వింటాళ్ల పత్తి చోరీ అయ్యిందని మంగళవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పత్తి చోరీకి పాల్పడ్డ వారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు.



**రికవరీ ఆఫీసర్ కార్యాలయం**
**డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్ వద్ద**
**3వ అంతస్తు, త్రివేణి కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్-500001**

ఫారం నం.13 అమ్మకం ప్రకటన
(రికవరీ ఆఫ్ డెట్స్ డ్యూ టు బ్యాంక్స్ అండ్ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్, 1993తో చదువబడే ఆదాయ పన్ను చట్టం, 1961కి రెండవ షెడ్యూలులోని రూల్ 38, 52(2) క్రింద)

**O.A. నం. 415/2014లో R.P. నం.693/2018**

దిగువ వారి మధ్య:
బ్యాంక్ ఆఫ్ బరోడా (ఇంతకు ముందు విజయ బ్యాంక్), ZOSAR బ్రాంచ్, సైఫాబాద్, హైదరాబాద్ ...సర్టిఫికెట్ హోల్డర్
మరియు
మెసర్స్ గురుకుల్ ఫౌండేషన్ మరియు ఇతరులు ...సర్టిఫికెట్ డెటార్స్

1. బ్యాంక్ ఆఫ్ బరోడా (ఇంతకు ముందు విజయ బ్యాంక్), ZOSAR బ్రాంచ్, సైఫాబాద్, హైదరాబాద్ మధ్య రికవరీ ఆఫ్ డెట్స్ అండ్ బ్యాంక్‌రప్సీ యాక్ట్, 1993 లోని సెక్షను 19(22) క్రింద గౌరవ ప్రిసైడింగ్ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్ వారిచే O.A. నంబరు 415/2014 లోని RP నం. 693/2018 ప్రకారం రికవరీ సర్టిఫికెట్ జారీ చేయబడినది మరియు అమలు కోసం దిగువ సంతకందారుకు అది పంపబడినది.

2. ఆదాయ పన్ను చట్టం 1961కి 2వ మరియు 3వ షెడ్యూళ్ళ క్రింద రికవరీ సర్టిఫికెట్‌లో నిర్దిష్టపరిచిన రూ. 5,03,00,009/- (ఐదు కోట్ల మూడు లక్షల తొమ్మిది రూపాయలు మాత్రమే) తోపాటు వడ్డీ, వ్యయాలు మొ॥వి దిగువ తెలిపిన సర్టిఫికెట్ డెటార్స్ నుండి రాబట్టుకునేందుకు O.A. నంబరు 415/2014 లోని RP నం. 693/2018లో రికవరీ ప్రొసీడింగ్స్‌ను దిగువ సంతకందారు చేపట్టారు.

1. మెసర్స్ గురుకుల్ ఫౌండేషన్, 11-3-50/ఎ, సీతాఫల్‌మండీ, సికింద్రాబాద్ మరియు సర్వే నం.లు 73 మరియు 74, అన్నంపట్ల గ్రామం మరియు గ్రామ పంచాయతీ, బీబీనగర్ మండలం, నల్లగొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం. ...సర్టిఫికెట్ డెటార్ నం. 1
2. శ్రీ ఎ. పిచ్చయ్య తండ్రి శ్రీ పి.ఎస్. అనంతరామన్, నివాసం : ఫ్లాట్ నం.202, ఇ.నం. 243/2, శ్రీ మధు ఎన్‌క్లేవ్, శ్యామ్‌లాల్ బిల్డింగ్స్, బేగంపేట్, హైదరాబాద్. ...సర్టిఫికెట్ డెటార్ నం. 2
3. డా. కె. అనిల్‌కుమార్ తండ్రి శ్రీ కె. వెంకట నారాయణ, ఇ.నం. ఎల్-77, వీధి నం.2, హెచ్‌ఎమ్‌టి నగర్, నాచారం, హైదరాబాద్. ...సర్టిఫికెట్ డెటార్ నం. 3
4. శ్రీ జి. శ్రీనివాసరాజు తండ్రి స్వర్గీయ శ్రీ జి. రామారావు, నివాసం : ఇ.నం. 11-3-50/ఎ, సీతాఫల్‌మండీ, సికింద్రాబాద్. ...సర్టిఫికెట్ డెటార్ నం. 4

5. రికవరీ సర్టిఫికెట్ సంతృప్తి మేరకు దీనికి జతచేసిన షెడ్యూల్‌లో తెలిపిన తనఖాపెట్టిన/ జప్తుచేయబడిన ఆస్తుల [illegible]

6. [illegible] 02.03.2023 [illegible]

7. [illegible] https://drt.auctiontiger.net [illegible]

8. [illegible] telangana@auctiontiger.net, praveen.thevar@auction-tiger.net [illegible]

[illegible]

సం/- [illegible]
రికవరీ ఆఫీసర్, డెట్స్ రికవరీ ట్రిబ్యునల్-1, హైదరాబాద్



# కలుపును నివారిస్తేనే అధిక దిగుబడి

- వరిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వ్యవసాయాధికారి రాజగోపాలరావు

పాడి పంట


కోనోవీడర్ ద్వారా వరి పొలంలో కలుపు తీస్తున్న రైతు

**నడిగూడెం:** ప్రస్తుతం మండల పరిధిలోని ఆయకట్టు గ్రామాలతో పాటు, నాన్ ఆయకట్టు గ్రామాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. కూలీల కొరత కారణంగా కలుపు తీయడం ఖర్చుతో కూడుకున్న పనిగా మారుతోంది. ఈ నేపథ్యంలో కలుపు నివారణకు వివిధ రసాయనాలు వినియోగించాల్సి ఉంది. వరిలో కలుపును ఎప్పటికప్పుడు నివారిస్తేనే దిగుబడి అధికంగా ఉంటుందని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు సూచిస్తున్నారు. వరిలో కలుపు నివారణకు చేపట్టాల్సిన యాజమన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

**▸ మాగాణి భూముల్లో..**

మాగాణి భూముల్లో నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లోగా 1 నుంచి 1.5 లీటర్ల బ్యుటాక్లోర్ లేదా 600 మి.లీ. ప్రెటిలాక్లోర్ అరలీటరు నీటిలో కలుపుకోవాలి. ఈ ద్రావణాన్ని 20కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో పలుచగా నీరు ఉంచి సమానంగా వెదజల్లుకోవాలి. గడ్డి, తుంగ, వెడల్పాటి కలుపు మొక్కలు ఉన్నప్పుడు ఎకరానికి 30 నుంచి 50 గ్రాములు ఆక్సాడయార్జిల్ పొడి మందును అరలీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని 20కిలోల పొడి ఇసుకలో కలిపి సమానంగా చల్లుకోవాలి.

**▸ ఊదలాంటి గడ్డి జాతి మొక్కలుంటే..**

15 నుంచి 20 రోజుల మధ్య పొలంలో ఊదలాంటి గడ్డిజాతి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరానికి 400 మి.లీ. సైహాలోఫాప్ బ్యూటైల్‌ను 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు, వెడల్పాటి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరానికి 80 నుంచి 100 మి.లీ. బైస్‌పైరి బ్యాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 25 రోజుల నుంచి 30 రోజుల మధ్య ఎకరానికి 400 గ్రాముల 2.4-డి సోడియం సాల్ట్ లేదా, 50 గ్రాముల ఇథాక్సీ సల్ఫురాన్‌ను లేదా 15శాతం పొడి మందుతో 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఎలాంటి కలుపు మొక్కలనైనా నివారించవచ్చు.

**▸ మెట్ట పొలాల్లో..**

మెట్ట పొలాల్లో వరిని వెదజల్లడం, గొర్రుతో విత్తడం వంటి రెండు పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ఇలా సాగుచేసిన పైరులో కలుపు నివారణకు విత్తిన రెండు లేక మూడు రోజుల్లోగా లీటరు నీటికి ప్రెటిలాక్లోర్ 50శాతం ద్రావణాన్ని లేదా బ్యుటాక్లోర్ కలిపి ఈ ద్రావణాన్ని ఇసుకలో కలిపి పొలంలో చల్లుకోవాలి.


ఎం. రాజగోపాల రావు, నడిగూడెం వ్యవసాయాధికారి

**కోనోవీడర్‌తో కలుపు తీయాలి**

శ్రీవరి లేదా యంత్రంతో నాటు లేదా డ్రమ్‌సీడర్ ద్వారా వేసిన వరి పొలాల్లో 40 రోజుల్లోపు ప్రతి 10 రోజులకు ఒకసారి కోనోవీడర్ లేదా పవర్ వీడర్‌తో నాలుగుసార్లు కలుపును తీయాలి. తొలగించిన కలుపు మొక్కలు పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతాయి. దీంతో పిలకలు, దుబ్బులు అధికంగా వస్తాయి. పంట దిగుబడి కూడా సాధారణ పద్ధతిలో కన్నా ఈ విధానంలో ఎక్కువగా వస్తుంది.